సాక్షి అన్నమయ్య జిల్లా

ఆదివారం । 18 । ఫిబ్రవరి । 2024



సెల్‌ఫోన్ కోసం వెళ్లి..
సెల్‌ఫోన్ కోసం వెళ్లి ఇద్దరు వ్యక్తులు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన సంఘటన శుక్రవారం రాత్రి కడప- రేణిగుంట జాతీయ రహదారిపై జరిగింది. -8లో



ఉత్సాహంగా బండలాగుడు పోటీలు
రాజంపేట మండలంలోని కుంపిణీపురం శ్రీభోగా ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన బండలాగుడు పోటీలు అలరించాయి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.120	రూ.160
రెండోరకం	రూ.70	రూ.116

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 128 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	436	476
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 1,256.780 కిలోలు

న్యూస్‌రీల్

చెక్‌పోస్టుల తనిఖీ
పెద్దతిప్పసముద్రం: మండలంలోని కర్ణాటక సరిహద్దులో ఉన్న నాలుగు చెక్‌పోస్టులను శనివారం జిల్లా ఎస్పీ కృష్ణారావు అకస్మికంగా తనిఖీ చేసారు. త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సిబ్బంది విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట ములకలచెరువు సీఐ తమ్మిశెట్టి మధు, ఎస్ఐ రవీంద్రబాబు ఉన్నారు.

గ్రూప్‌-2 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి
రాయచోటి: జిల్లాలో ఈనెల 25న జరగబోయే గ్రూప్‌-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అధికారులను ఆదేశించారు. శనివారం గ్రూప్‌-2 పరీక్షలపై వివిధ శాఖల అధికారులతో జేసీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఏపీపీఎస్సీ ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం పరీక్షను పక్కాగా నిర్వహించాలన్నారు. పరీక్ష హాల్‌లో ఎలాంటి కాపీయింగ్ జరగకూడదన్నారు. పరీక్ష హాల్‌లోకి డిజిటల్ వస్తువులను అనుమతించరాదన్నారు.

అశ్వవాహనంపై అనంతమూర్తి



అశ్వవాహనంపై విహరిస్తున్న కడపరాయుడు

కడప కల్చరల్: దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం స్వామిని సర్వభూపాల వాహనంలో కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు. విశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. రాత్రి కనుల పండువగా అలంకరించిన అశ్వవాహనంపై స్వామివారిని మాడవీధుల్లో ఊరేగించారు.ఉత్సవాల్లో భాగంగా గురువారం చక్రస్నానం జరగనుంది. రాత్రి హంస వాహనసేవ, ధ్వజావరోహణ కార్యక్రమాలు జరుగుతాయి.

ఉద్యోగ విప్లవం





ఇతని పేరు హనుమంతు నరసింహ. బద్వేలు పట్టణంలోని దిగువ బ్రాహ్మణవీధిలో నివసిస్తుంటారు. 2014లో ఐటీఐ పూర్తి చేసుకుని పై చదువులు చదివే స్తోమత లేక ఉద్యోగం కోసం ఎదురు చూశారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు బాబు వస్తే జాబ్ వస్తుందని, ఇంటికో ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ అది నెరవేరలేదు. 2019లో రాష్ట్రంలో జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక గోపవరం మండలంలో సెంచరీ పానెల్స్ పరిశ్రమ ఏర్పాటు చేయడంతో ఆపరేటర్ ఉద్యోగం లభించింది. తండ్రి మరణించిన నేపథ్యంలో కుటుంబ పోషణ భారంగా ఉన్న సమయంలో జగనన్న ద్వారా ఉద్యోగం లభించడం సంతోషంగా ఉందని హనుమంతు చెబుతున్నారు.





ఇతని పేరు రేనాటి నాగేంద్ర. బద్వేలు పట్టణంలోని అబ్బరాతి వీధిలో ఉంటారు. పదేళ్ళ క్రితం ఐటీఐ పూర్తి చేసుకుని ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్న సమయంలో 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇంటికో ఉద్యోగం ఇస్తామని, జాబు రావాలంటే బాబు రావాలని ఇచ్చిన హామీలు ఆశలు కలిగించాయి. అయితే బూటకపు హామీలిచ్చి చంద్రబాబు నిరుద్యోగ యువతను మోసం చేశారు. 2019లో రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత గోపవరం మండలంలో సెంచరీ పానెల్స్ పరిశ్రమ ఏర్పాటు కావడంతో ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఎలక్ట్రికల్ విభాగంలో ఉద్యోగం వచ్చింది. పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటానని నాగేంద్ర అంటున్నారు.



సెంచరీ పానెల్స్‌లో ఉద్యోగ నియామక పత్రాలు పొందిన యువకులు (ఫైల్)

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాలుగున్నరేళ్ల కాలంలో జిల్లాకు చెందిన నిరుద్యోగ యువత వేలసంఖ్యలో ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకున్నారు. జిల్లాలో పారిశ్రామిక ప్రగతి, విశ్వవిద్యాలయాలు, మెడికల్ కళాశాలల ఏర్పాటుతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయి. సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో జిల్లాలో 645 సచివాలయాల పరిధిలో వేలసంఖ్యలో ఆయా విభాగాల కార్యదర్శుల ఏర్పాటు పూర్తయింది. వీటితో పాటు మెగా జాబ్‌మేళాలు నిర్వహిస్తూ ఉద్యోగాల సాధన, కల్పనే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుంటే.. 'కొత్త బిచ్చగాడు పొద్దెరగడు'అన్న చందంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి నిరుద్యోగులతో సమావేశమంటూ సరికొత్త డ్రామాకు తెరతీయడంతో పరిశీలకులు నవ్వుతున్నారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ఈస్థాయిలో ఉద్యోగాల భర్తీ చేపట్టింది ఈ ప్రభుత్వమే అంటూ... వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచేందుకు 'సిద్ధం'అంటున్నారు.

- పారిశ్రామికీకరణతో జిల్లాలో ఉద్యోగాల వెల్లువ
- తాజాగా డీఎస్సీ, గ్రూప్‌-1, గ్రూప్‌-2 ఉద్యోగాలకు నోటిఫికేషన్లు
- నిరుద్యోగం అంటూ కొత్త డ్రామాకు తెరలేపిన టీడీపీ నాయకులు

సాక్షి ప్రతినిధి, కడప/ వైవియూ: కరువు సీమ కడప గడపలో విద్యార్థులు, నిరుద్యోగులు విద్య, ఉద్యోగాల కోసం వలసలు వెళ్లకూడదన్న లక్ష్యంతో ప్రభుత్వం జిల్లాలో పరిశ్రమలు, ఉన్నతవిద్యాసంస్థలు ఏర్పాటు చేసి ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థానిక యువతకు ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా వైఎస్‌ఆర్ కడప జిల్లాలో కొప్పర్తి పారిశ్రామికవాడలో పదుల సంఖ్యలో భారీపరిశ్రమలు ఏర్పాటు చేశారు. ఇందులో ఒక్క డిక్సన్ కంపెనీలోనే దాదాపు 1300 మంది ఉద్యోగావకాశాలు దక్కించుకోగా, బద్వేలు సమీపంలో ఏర్పాటు చేసిన సెంచరీ ఫ్లై బోర్డ్స్ సంస్థలో దాదాపు 2,078 మంది స్థానికులైన నిరుద్యోగులు అవకాశాన్ని దక్కించుకున్నారు. వీటితో పాటు నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం, యోగి వేమన విశ్వవిద్యాలయంలో బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలతో పాటు, పులివెందుల మెడికల్ కళాశాల, రిమ్స్, మానసిక వైద్యశాల, క్యాన్సర్ హాస్పిటల్స్‌లో నియామకాల ప్రక్రియ చేపట్టింది. వైఎస్‌ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్‌ల ఏర్పాటుతో వైద్యుల నియామకం, సహాయ సిబ్బంది ఏర్పాటుతో సేవలు మరింత దగ్గరయ్యాయి. వీటితో పాటు జిల్లా వ్యాప్తంగా వివిధ శాఖల్లో పనిచేస్తూ వచ్చిన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను సైతం ఒకగూటి కిందికి తీసుకువచ్చి వారందరినీ ఆప్కాస్ కింద చేర్చి ఉద్యోగభద్రత కల్పించిన విషయం తెలిసిందే.

గ్రామసచివాలయాల ఏర్పాటుతో..

గ్రామస్వరాజ్యమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ ఏర్పాటు దేశంలోనే ప్రత్యేకంగా నిలవగా, నియామక ప్రక్రియ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 1.25 లక్షల మందికి ఏకకాలంలో ఉద్యోగావకాశాలు కల్పించడం ఒక చరిత్ర. ఇక జిల్లాలో 645 సచివాలయాల పరిధిలో 5,400 మంది సచివాలయ కార్యదర్శుల నియామక ప్రక్రియ చేపట్టారు. వీటికి అనుబంధంగా సేవలందించేందుకు ప్రతి 50 ఇళ్లకు గ్రామవలంటీర్లను ఏర్పాటు చేశారు. తాజాగా డీఎస్సీ ద్వారా నియామకాలు చేపట్టేందుకు జిల్లాలో 289 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేశారు. వీటితో పాటు గ్రూప్‌-1, గ్రూప్‌-2 ఉద్యోగాల నియామక ప్రక్రియ ప్రారంభమైంది.

నాలుగేళ్లలో లభించిన ఉద్యోగాలు

- సచివాలయ వ్యవస్థలో: 5400
- జాబ్‌మేళాల ద్వారా: 4200
- సెంచరీ పరిశ్రమ: 2078
- డిక్సన్ పరిశ్రమ: 1300
- డా. వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూ: 160 (బోధన, బోధనేతర)
- యోగివేమన విశ్వవిద్యాలయం: 75 (ఆప్కాస్)
- రిమ్స్ : 84 పోస్టులు
- క్యాన్సర్, మానసిక వైద్యశాలలు : 100 (నియామక ప్రక్రియ కొనసాగుతోంది)
- పులివెందుల మెడికల్ కళాశాల: 97 పోస్టులు

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిరుద్యోగులకు అండగా నిలిచారు. ముఖ్యంగా వైద్యరంగంలో లెక్కకు మించి నియామకాలు చేపట్టారు. దాని ఫలితంగానే నాకు స్టాఫ్ నర్స్‌గా ఉద్యోగం వచ్చింది. ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం. - ఎస్ విమలావతి, స్టాఫ్ నర్స్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి. కడప

స్థానికంగా ఉద్యోగ అవకాశం

ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ ఏర్పాటుతో ఇక్కడి విద్యార్థులకు ఆర్కిటెక్చర్ వంటి అరుదైన కోర్సులు చదివే అవకాశం లభించింది. ఇక్కడే ఉద్యోగ అవకాశం లభించడం సంతోషంగా ఉంది. -సి. లక్ష్మివాణి, ఎం.ఆర్క్, అధ్యాపకురాలు, డా. వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూ

మేల్ నర్సింగ్‌గా అవకాశం లభించింది

డిగ్రీ చదివిన నాకు కోవిడ్ సమయంలో మేల్ నర్సింగ్ ఆర్డర్లీగా పనిచేశాను. 2021లో వచ్చిన నోటిఫికేషన్‌లో ప్రభుత్వం వెయిటేజి ఇచ్చి కడప ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పనిచేసే అవకాశం కల్పించింది. మాలాంటి నిరుద్యోగులకు ఎందరికో అవకాశాలు కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. - పి. పవన్, దిగువపల్లి, వల్లూరు మండలం

ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లను పటిష్టవంతం చేయండి

జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

మదనపల్లె: మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి జెడ్పీహైస్కూల్‌లో ఏర్పాటుచేస్తున్న ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్‌రూమ్‌లను మరింత పటిష్టవంతంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించాక, తొలిసారిగా మదనపల్లెకు వచ్చిన ఆయన ఎన్నికల విధులకు సంబంధించి శనివారం పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, జెడ్పీహైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్, ఎలక్షన్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ రూమ్‌లను అధికారులతో కలిసి పరిశీలించారు. మదనపల్లె నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల సంఖ్య, పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటుచేసిన వసతులు, కల్పించిన సౌకర్యాలు, ప్రతి పోలింగ్ కేంద్రం తెలుసుకునేందుకు వీలుగా నేమ్‌బోర్డ్‌లు, నెంబర్స్ ఏర్పాటు చేశారా అనే విషయాలను ఆర్డీఓ హరిప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో ఓటరు నమోదుకు సంబంధించి ఫారం-6,7,8,8ఏ ఎన్ని వచ్చాయి. వాటిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారనే విషయమై కమిషనర్ ప్రమీలను అడిగి తెలుసుకున్నారు. జెడ్పీహైస్కూల్‌లో స్ట్రాంగ్‌రూమ్ ఏర్పాటుకు చేస్తున్న నిర్మాణపనులను పరిశీలించారు. లీకేజీలు లేకుండా, మరమ్మతులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. తహసీల్దార్ రమాదేవి, సర్వేయర్ సుబ్రహ్మణ్యం, ఆర్‌ఐ రెడ్డెప్ప, ఎలక్షన్ డీటీ అస్లాం తదితరులు పాల్గొన్నారు.

- ఎన్నికలకు సంబంధించి సమస్యలు ఉంటే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలు తదితర అంశాలపై సమస్యలు ఉన్నా ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

టీడీపీలో మారుతున్న సమీకరణాలు

- జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసులరెడ్డి నియామకం
- పార్లమెంట్‌కు పోటీ చేయాలని అధిష్టానం అల్టిమేటం
- కుటుంబానికి ఒక్కటే టికెట్ నిబంధన అమలు చేస్తే కడప అసెంబ్లీ టికెట్ కట్
- ఉమాదేవికి చిగురిస్తున్న ఆశలు



సాక్షి ప్రతినిధి, కడప: తెలుగుదేశం పార్టీలో సమీకరణలు మారుతున్నాయి. రాజకీయ పార్టీల పొత్తులకు తగ్గట్లుగా తెలుగుతమ్ముళ్లను అనువుగా మల్చుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. సీట్లు సర్దుబాటుకు అనేక వ్యూహాలు అమలు చేస్తున్నారు. కుటుంబానికి ఒక్కటే టికెట్ నిబంధన దృష్టిలో ఉంచుకొని తదనుగుణంగా అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా అధ్యక్షుడి మార్పు సైతం చేపట్టారు. మరోవైపు ఇన్‌చార్జిలను కాదని, మెరుగైన అభ్యర్థి కోసం అన్వేషణ కొనసాగిస్తున్నారు. టికెట్ ఇస్తాం, పోటీ చేయాలని టీడీపీ అభ్యర్థిస్తుంటే ఎన్నికల ఖర్చు (ఎదురుకట్నం) భరిస్తే పోటీ చేస్తామనే షరతులు తెరపైకి వస్తున్నాయి.

ఈమారు ఎన్నికల్లో చావో రేవో తేల్చుకోవాలని తెలుగుదేశం పార్టీ భావిస్తోంది. ఆ మేరకు ఆయా పార్టీలు అసహ్యించుకున్నా, ఛీదరించుకున్నా సరే రాజకీయ పొత్తులు పెట్టుకుని పోటీకీ వెళ్లాలనే దిశగా అడుగులు వేస్తున్నారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. అందులో భాగంగా రాజకీయ పార్టీలతో సీట్లు, నేతలకు టికెట్లు సర్దుబాటు దిశగా నిమగ్నమయ్యారు. జిల్లా అధ్యక్షుడిగా ఉన్న మల్లెల లింగారెడ్డిని తప్పించి ఆ స్థానంలో పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఉన్న ఆర్ శ్రీనివాసులరెడ్డిని నియమించారు. ఈ నియామకం సైతం సర్దుబాటులో భాగంగా చేపట్టినట్లు సమాచారం. ఇప్పటికే శ్రీనివాసులరెడ్డి సతీమణి మాధవీరెడ్డి కడప ఇన్‌చార్జిగా, సోదరుడు మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్‌రెడ్డి రాయచోటి ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు.

చిగురిస్తున్న కార్పొరేటర్ ఉమాదేవి ఆశలు....

కడప అసెంబ్లీ టికెట్ తనకే, పోటీ చేస్తున్నది తామేనంటూ ఇంతకాలం చెప్పుకొచ్చిన మాధవీరెడ్డి అభ్యర్థిత్వం తాజాగా ప్రశ్నార్థకంగా మారింది. కుటుంబానికి ఒకటే టికెట్ అనే నిబంధన అమలు చేస్తే భర్త శ్రీనివాసులరెడ్డి పార్లమెంట్‌కు పోటీ చేస్తే, అసెంబ్లీ టికెట్ మళ్లీ ఆ కుటుంబానికి లభించే అవకాశం లేదని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. ఈపరిస్థితుల్లో కార్పొరేటర్ ఉమాదేవికి తన అభ్యర్థిత్వంపై ఆశలు చిగురిస్తున్నాయి. నారా లోకేష్ ద్వారా ముందే లభించిన హామీ ప్రకారం టికెట్ దక్కుతుందనే దిశగా ఉమాదేవి కుటుంబం అంచనాలో ఉన్నట్లు సమాచారం.

మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ కోసం వెంపర్లాట....

తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కోసం టీడీపీ అధిష్టానం వెంపర్లాడుతోంది. ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి ద్వారా పలుమార్లు మంతనాలు నిర్వహించినట్లు సమాచారం. ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్నానని, పెద్దిరెడ్డి కుటుంబానికి దీటుగా నిలవాలంటే ఎన్నికల ఖర్చు పార్టీనే భరించాలనే షరతు పెట్టినట్లు సమాచారం. ఆ మొత్తం ముందే డిపాజిట్ చేయాలనే డిమాండ్ చేసినట్లు తెలిసింది. తంబళ్లపల్లెలో అవసరం కాబట్టి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ మేరకు డబ్బులు సర్దుబాటు చేస్తే మిగతా నియోజకవర్గాల్లో తలనొప్పులు తప్పవనే దిశగా టీడీపీ జాగ్రత్త పడుతున్నట్లు సమాచారం.

అసెంబ్లీ కాదు...పార్లమెంట్‌కు పోటీ
పార్లమెంట్ కంటే కడప అసెంబ్లీ సీటుపైనే శ్రీనివాసులరెడ్డి కుటుంబం మక్కువతో ఉంది. ఈ ఎన్నికల్లో కడపలో పోటీ చేసి పట్టు సాధించాలని తపిస్తున్నారు. కడప అసెంబ్లీ సీటు మాధవీరెడ్డికి, రాయచోటి అసెంబ్లీ సీటు రమేష్‌కుమార్‌రెడ్డికి ఇవ్వడం సాధ్యం కాదనే దిశగా టీడీపీ అధిష్టానం అడుగులేస్తోంది. అందులోభాగంగా కడప పార్లమెంట్ అభ్యర్థిగా శ్రీనివాసులరెడ్డిని పోటీ చేయాల్సిందిగా అల్టిమేటం జారీ చేసినట్లు సమాచారం. ఓడిపోతే రాజ్యసభ సీటు ఇస్తామనే ప్రతిపాదన పెట్టినట్లు తెలుస్తోంది. 'రోగి కోరుకున్నది, డాక్టర్ ఇచ్చే మందు ఒక్కటే'అయితే ఎలాంటి సమస్య లేదన్నట్లుగా టీడీపీ అధిష్టానం షరతును వెంటనే శ్రీనివాసులరెడ్డి అంగీకరించినట్లు తెలిసింది. గెలుపోటములు దేవుడెరుగు రాజ్యసభకు అవకాశమిస్తే అదే చాలన్నట్లుగా టీడీపీ అధిష్టాన నిర్ణయాన్ని స్వాగతించినట్లు సమాచారం. ఆ మేరకే అనూహ్యంగా జిల్లా అధ్యక్షపదవి కట్టబెట్టినట్లు తెలుస్తోంది.

ప్రొద్దుటూరులో గందరగోళం
ప్రొద్దుటూరు టీడీపీలో గందరగోళం కొనసాగుతూనే ఉంది. ఆశావహుల్లో ముగ్గురు వ్యక్తిగతంగా ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సురేష్‌నాయుడు బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం పేరిట ఎన్నికల ప్రచారం చేపడుతున్నారు. ఇప్పటికీ ఆశావహులకు అధిష్టానం నుంచి క్లారిటీ లేదని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. మరోవైపు బీజేపీ పొత్తు కుదిరితే ఆ సీటు డిమాండ్ చేస్తారేమో అనే భావన కూడా టీడీపీలో లేకపోలేదు. మాజీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తెరపైకి వచ్చినా ఆశ్చర్యం లేదని పలువురు చెప్పుకొస్తున్నారు. ఆదికి జమ్మలమడుగు సీటు కోరాలనే ఆలోచన ఉన్నప్పటికీ కుటుంబంలో తీవ్ర ప్రతిఘటన ఉత్పన్నమవుతున్నట్లు సమాచారం. చదిపిరాళ్ల కుటుంబ సభ్యులంతా మూకుమ్మడిగా భూపేష్‌రెడ్డిని సమర్థిస్తుండడంతో ఆది చూపులు ప్రొద్దుటూరు వైపు మళ్లినట్లు తెలుస్తోంది. ఈపరిస్థితుల్లో అక్కడ గందరగోళం నెలకొందని పరిశీలకుల భావన.

రమేష్‌రెడ్డి కినుక
టీడీపీ అధిష్టానం వైఖరి, సోదరుడు శ్రీనివాసులరెడ్డి శైలితో రాయచోటి ఇన్‌చార్జి రమేష్‌కుమార్‌రెడ్డి కినుక వహించారు. తన రాజకీయ భవిష్యత్‌పై ఆత్మీయులతో సోమవారం లక్కిరెడ్డిపల్లెలో సమావేశం నిర్వహించనున్నారు. ఇరువై ఏళ్లుగా టీడీపీ కోసమే పనిచేస్తున్నా తగిన గుర్తింపు లేదని,తనకు తెలియకుండా మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డిని పార్టీలో చేర్చుకున్నారని మదనపడినట్లు తెలుస్తోంది. రాజకీయంగా చురుగ్గా ఉన్న తనను కాదని, కాంట్రాక్టరైన సోదరుడు శ్రీనివాసులరెడ్డిని ప్రోత్సహించడాన్ని కూడా జీర్ణించుకోలేక పో తున్నట్లు సమాచారం. ఈక్రమంలో ఆత్మీయులతో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. తదుపరి కార్యాచరణ దిశగా అడుగులు వేయనున్నట్లు తెలుస్తోంది.

మదనపల్లెలో ఘల్లుమన్న పాయల్



షోరూం ఎండీలు వర్గీస్ ఆలుక్కా, పాల్‌జే. ఆలుక్కాతో కలిసి ఆభరణాలు చూపులున్న, పాయల్ రాజ్‌పుత్

మదనపల్లె: మదనపల్లెలో ఆర్‌ఎక్స్ 100, మంగళవారం సినిమాల హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ సందడి చేశారు. పట్టణంలోని జోస్ ఆలుక్కాస్ షోరూం ప్రారంభోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అందాల తార పాయల్ రాజ్‌పుత్ షాపింగ్‌మాల్‌ను ప్రారంభించారు. ఆభరణాలను తిలకిస్తూ... కొనుగోలు చేసేందుకు వచ్చిన వినియోగదారులను పలకరించారు.దీంతో యువకులు కేరింతలు కొట్టారు. ఆమెతో సెల్ఫీ దిగేందుకు పోటీపడ్డారు. మదనపల్లెకు రావడం తనకు ఎంతో సంతోషంగా ఉందని పాయల్ రాజ్‌పుత్ అన్నారు.

షోరూంను ప్రారంభించిన ఎమ్మెల్యే



మదనపల్లెలో జోస్ ఆలుక్కాస్ షోరూంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లెలో జోస్ ఆలుక్కాస్ ఆభరణాల షోరూంను ఎమ్మెల్యే నవాజ్‌బాషా ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, సెలబ్రిటీ గెస్ట్‌గా సినీనటి పాయల్ రాజ్‌పుత్ హాజరయ్యారు. జోస్ ఆలుక్కాస్ మేనేజింగ్ డైరెక్టర్లు వర్గీస్ ఆలుక్కా, పాల్.జే.ఆలుక్కా, జాన్ ఆలుక్కా మాట్లాడుతూ..జోస్ ఆలుక్కాస్ షోరూంలో కనిష్టంగా రూ.50వేల విలువైన బంగారు ఆభరణాల కొనుగోలుపై ప్రత్యేక ప్రారంభోత్సవ ఆఫర్ కింద ఒక ప్రోత్సాహక బంగారు నాణేన్ని వినియోగదారులకు అందిస్తున్నామన్నారు. ఈ ఆఫర్ ఫిబ్రవరి 21 వరకు ఉంటుందన్నారు. అలాగే వజ్రాలపై 20శాతం, ప్లాటినం ఆభరణాలపై 7శాతం తగ్గింపును వినియోగదారులు పొందవచ్చన్నారు.

క్లుప్తంగా

20 మద్యం బాటిళ్లు స్వాధీనం

సంబేపల్లె : అక్రమంగా తరలిస్తున్న 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మండలంలోని అడివికమ్మపల్లి సమీపంలో అక్రమంగా మద్యం తరలిస్తున్నారని ముందస్తు సమాచారం రావడంతో దాడి నిర్వహించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత

ములకలచెరువు : మండల కేంద్రంలో అదృశ్యమైన సోహెల్ (12) అనే బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్ఐ తిప్పేస్వామి శనివారం తెలిపారు. ఈ బాలుడు స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో ఏడవ తరగతి చదువుతూ ఇంట్లో చెప్పకుండా శుక్రవారం రైలులో తెలంగాణ రాష్ట్రం చేరుకున్నాడు. అక్కడి పోలీసులు గమనించి ములకలచెరువు పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయాన్ని బాలుడి తల్లిదండ్రులకు చెప్పడంతో వారు అక్కడికి వెళ్లగా పోలీసులు బాలుడిని అప్పగించారని ఎస్ఐ తెలిపారు.

జూదరుల అరెస్టు

ఓబులవారిపల్లె : కాకర్లవారిపల్లి గ్రామంలో పేకాట ఆడుతున్న ఎనిమిందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. పక్కా సమాచారంతో శనివారం తమ సిబ్బందితో కలిసి కాకర్లవారిపల్లి గ్రామంలో పేకాట ఆడుతున్న స్థావరంపై దాడి చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని వారివద్ద నుంచి రూ. 41,583లు నగదుతోపాటు 52 పేకముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాసులు, కానిస్టేబుల్స్ నరసింహ, బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

మదనపల్లె సిటీ : భార్య,భర్తల మధ్య విభేదాల కారణంగా భార్య పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మదనపల్లె మండలం కొత్తిండ్లు పంచాయతీ రంగారెడ్డి కాలనీలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. రంగారెడ్డి కాలనీకి చెందిన చైతన్య భార్య శశి(28) ఈనెల 15న ఎలుకల మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరుకు రెఫర్ చేశారు. అక్కడ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరిపాలన విప్లవానికి నాంది వలంటీర్ వ్యవస్థ

- వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి


వలంటీర్లను సన్మానించిన ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, మండల నాయకులు

రామాపురం : వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన వలంటీర్ వ్యవస్థ పరిపాలనలో ఒక గొప్ప విప్లవానికి నాందిగా నిలిచిందని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల చెంతకే పాలనను సీఎం జగన్ అందిస్తున్నారన్నారు. 2వేలు జనాభా దాటిన ప్రతి గ్రామానికి గ్రామ, వార్డు సచివాలయాన్ని తీసుకొచ్చి పరిపాలనను సరళీకరించిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99శాతం నెరవేర్చిన ఘనత కూడా వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. రూ. 2.55లక్షల కోట్ల నిధులను వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందించారన్నారు. ఒక రాయచోటి నియోజకవర్గంలోనే సంక్షేమ పథకాల ద్వారా రూ.2వేల కోట్లు ప్రజలకు నేరుగా అందడం ఒక చరిత్ర అని అన్నారు.

ఆరు గ్యారంటీల అమలు ఎలా చంద్రబాబూ?

2014లో మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఇప్పుడు భవిష్యత్‌కు గ్యారంటీ అంటూ ఆరు గ్యారంటీ పథకాలు తెస్తామని మోసపూరిత హామీలు ఇస్తూ ఊరూరా తిరుగుతున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. చంద్రబాబు తన ఆరు గ్యారంటీ పథకాలకు ఏటా రూ.72వేల కోట్లు ఖర్చు అవుతుందని, వాటితో పాటు తప్పని సరిగా ఇవ్వాల్సిన పథకాలకు ఏటా రూ.53వేలు కోట్లు మొత్తం రూ.1.25లక్షల కోట్లు ఖర్చు అవుతుందన్నారు. ఈ నిధులు ఎక్కడి నుండి ఎలా తెస్తారో చంద్రబాబు చెప్పాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల మేనిఫెస్టోను ఆన్‌లైన్‌లో లేకుండా చేసిన ఘనత టీడీపీదే

గత ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ 600 పథకాలకు సంబంధించిన హామీలను ఇచ్చి ఏ ఒక్కటీ పూర్తిగా నెరవేర్చక మేనిఫెస్టోను ఆన్‌లైన్‌లో లేకుండా చేసిందన్నారు. అదే వైఎస్ జగన్ రెండు పేజీల మేనిఫెస్టోను ప్రకటించి నాలుగేళ్ల పాలన కాలంలో 99శాతం నెరవేర్చి రికార్డు సృష్టించారన్నారు.

ఒంటరిగా పోటీ చేసే దమ్ముందా..?

చంద్రబాబుకు నిజంగా ప్రజల్లో విశ్వాసం ఉంటే ఎవ్వరి పొత్తు లేకుండా ఎన్నికలలో పోటీ చేయాలని డిమాండ్ చేశారు ప్రజల ఆశీస్సులతో జగన్ సింహంలా ఒంటరిగానే పోటీ చేస్తున్నారన్నారు.

రాయచోటి జిల్లా కేంద్రం కావడం వరం

అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటి కావడం ఒక వరమని, తహసీల్దార్ కార్యాలయ స్థాయి గల మన రాయచోటికి కలెక్టర్ కార్యాలయం తెచ్చుకున్నామన్నారు. జిల్లా కేంద్రంలో 95 ప్రధాన కార్యాలయాలు ఏర్పాటవుతున్నాయన్నారు. రాయచోటి పట్టణ విస్తరణ , అభివృద్ధి జరుగుతుందన్నారు.

సేవా సైన్యానికి వందనాలు..

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా నిలబడి సేవలందిస్తున్న గ్రామ, వార్డు వలంటీర్లను ప్రోత్సహిస్తూ వరుసగా నాల్గవ ఏడాది వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మహాత్మాగాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం సాధన దిశగా సీఎం జగన్ సచివాలయం వ్యవస్థను నెలకొల్పి ప్రజలకు సేవ చేసే సదవకాశాన్ని ఎంతో మంది యువతకు కల్పించారన్నారు. కార్యక్రమంలో మాజీ రెస్కో చైర్మన్ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ వెంకటరమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, వైస్ ఎంపీపీలు రవిశంకర్‌రెడ్డి, బాబు, సింగిల్ విండో అధ్యక్షుడు పెద్దిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

త్వరితగతిన అభివృద్ధి పనుల పూర్తి


ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ న్యామతుల్లా, జిల్లా అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి : రాయచోటి నియోజకవర్గంలో నిర్మాణంలో ఉన్న ఆర్‌అండ్‌బీ రహదారుల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అధికారులకు సూచించారు. టెండర్ పూర్తయిన అన్నమయ్య జిల్లా ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ పనులపై ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ న్యామతుల్లాతో శనివారం స్టేట్ గెస్ట్ హౌస్‌లో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి చర్చించారు. ఇది వరకే రూ. 100 కోట్ల నిధులతో టెండర్లు పిలిచి ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణ పనులను ఈ నెలాఖరులోగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శంఖుస్థాపన చేసే కార్యక్రమంపై చర్చించారు. చెన్నముక్కపల్లె బైపాస్ రోడ్డు నిర్మాణ పనుల నిమిత్తం రూ. 4.50 కోట్లు నిధులు మంజూరు అయ్యాయన్నారు. ఇందులో రూ.3 కోట్ల నిధులు భూసేకరణ నిమిత్తం ఫైల్ కలెక్టర్ పరిశీలనలో ఉందన్నారు. కలెక్టర్ పరిశీలన అనంతరం మిగిలిన రూ. 1.50 కోట్ల నిధులతో రహదారుల పనులు ప్రారంభమయ్యేలా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఎస్ఈ మహేశ్వర రెడ్డి, ఈఈ సహదేవరెడ్డి, డీఈ వెంకటసుబ్బయ్య, ఏఈ గిరీశ్వరరావు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్ వాసులకు కుచ్చుటోపీ

- అధికవడ్డీ ఆశతో యాప్‌లో నగదు చెల్లింపు
- రూ.10 లక్షలకుపైగా మోసపోయిన వైనం

బి.కొత్తకోట : రెడ్‌రాక్ పవర్ లిమిటెడ్ మోసాలకు బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ వాసులు బలయ్యారు. ఈ సంస్థ మోసాలపై సుండుపల్లెలో కేసు నమోదు కావడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. అధికవడ్డీ, రోజువారీ వడ్డీ ఆశలకు బలయ్యామని రోదిస్తున్నారు.

హార్సిలీహిల్స్‌పై వివిధ ప్రభుత్వశాఖల సిబ్బంది, స్థానికులు ఉంటున్నారు. కొంతకాలం క్రితం ఈ సంస్థ యాప్‌ను మొబైల్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకున్నారు. యాప్ ద్వారా చెల్లింపులు చేశాక నమ్మకంగా వడ్డీతో సహా నగదు మళ్లీ ఖాతాలకు జమ అయింది. దీంతో కొండపై ఒకరినుంచి మరొకరికి ఇలా అందరికి వ్యాపించింది. ఖాతాల నుంచి యాప్ ద్వారా నగదు డిపాజిట్ చేయగా ఒకరోజుకు వడ్డీ అంటూ ఖాతాలకు జమ అయింది. మరింత నమ్మకం కుదరడంతో మరికొందరు యాప్ ద్వారా నగదు చెల్లించారు. ఇలా రూ.10 లక్షలకుపైగా యాప్ ద్వారా చెల్లించారు. ఈ యాప్ ద్వారా చెల్లింపు కాని, తిరిగి నగదు జమ కావడం లేదని గుర్తించిన ఖాతాదారులకు రెండు రోజుల నుంచి యాప్ కూడా పని చేయకుండా ఆగిపోయింది. దీంతో తామంతా మోసపోయామని భావించేలోగా సుండుపల్లెలో అత్యధిక సంఖ్యలో ప్రజలు మోసపోయారనే విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో హార్సిలీహిల్స్ బాధితులు కుయ్యోమొర్రో అంటున్నారు. యాప్‌కు డబ్బు జమ చేసిన వారిలో టూరిజం సిబ్బంది అధికంగా మోసపోయినట్టు తెలుస్తోంది. ఓ చిరుద్యోగి ఏకంగా పాడిఆవును విక్రయించి ఆ సొమ్మును జమ చేసి మోసపోయాడు. కాగా కొండపై ఉంటున్న వారికి సుండుపల్లెకు చెందిన వారితో పరిచయాలు ఉండటంతో ఈ యాప్ వ్యవహారం ఇక్కడికి చేరినట్టు చెప్పుకుంటున్నారు.

సెల్‌ఫోన్ కోసం వెళ్లి..

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి


ఈశ్వరయ్య (ఫైల్)


పెంచలయ్య మృతదేహం

రాజంపేట : సెల్‌ఫోన్ కోసం వెళ్లి ఇద్దరు వ్యక్తులు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన సంఘటన శుక్రవారం రాత్రి రాజంపేట మండలంలోని కడప-రేణిగుంట జాతీయ రహదారిపై జరిగింది. వివరాలు ఇలా.. నందలూరు మండలం ఆడపూరుకు చెందిన కలిశెట్టి ఈశ్వరయ్య (28) వత్తలూరులోని తన మేనమామ ఇంటికి వెళ్లాడు. శుక్రవారం మళ్లీ స్వగ్రామానికి వచ్చేశాడు. మార్గం మధ్యలో సెల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. అదే గ్రామానికి చెందిన వారికి దొరకడంతో వారు ఫోన్ చేసి ఈశ్వరయ్య మేనమామకు ఇచ్చారు. ఈ విషయం తన మేనమామ ద్వారా తెలుసుకున్న ఈశ్వరయ్య శుక్రవారం రాత్రి 7గంటలకు ఆటో తీసుకొని వత్తలూరుకు తనకు తోడుగా పెంచలయ్య(27)ను తీసుకెళ్లాడు. అక్కడి నుంచి ఆటోను పంపించేశారు. బైకు తీసుకొని బయలుదేరారు. రాత్రి 11 గంటల సమయంలో కడప-రేణిగుంట జాతీయరహదారిలోని సింగ్‌డాబా (రాజంపేట మండలం) సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం రాజంపేట ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈశ్వరయ్యకు భార్య, కుమారుడు ఉన్నారు. జీవనోపాధి కోసం కత్తర్‌కు వెళ్లి ఇటీవల వచ్చాడు. కాగా మరో మృతుడు పెంచలయ్య తల్లి జీవనోపాధి కోసం విదేశాలకు వెళ్లింది. ఆమె వచ్చిన తర్వాత మృతదేహానికి పోస్టుమార్టం చేసి అప్పగించాల్సి ఉంటుందని మన్నూరు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మన్నూరు ఏఎస్ఐ సుబ్బయ్య తెలిపారు. మృతులు ఇద్దరు ఒకే గ్రామానికి చెందిన వారు కావడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

మొదటి బహుమతి కైవసం చేసుకున్న మైదుకూరు వృషభాలు


బండలాగుడు పోటీలలో పాల్గొన్న ఎద్దులు

నందలూరు(రాజంపేట) : మండలంలోని కుంపిణీపురం శ్రీభోగా ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండవరోజు శనివారం సాయంత్రం నిర్వహించిన బండలాగుడు పోటీలు అలరించాయి. మైదుకూరుకు చెందిన కుర్రా వెంకటేశ్ యాదవ్ వృషభాలు మొదటి స్థానంలో నిలిచి రాజంపేట ఎమ్మెల్యే మేడా వెంకటమల్లికార్జున రెడ్డి విరాళంగా అందజేసిన రూ.50 వేలు నగదు బహుమతిని అందుకున్నారు. కడప జిల్లా మూలపల్లె, మూల ప్రసాద్ రెడ్డి ఎద్దులు ద్వితీయ స్థానంలో నిలిచి రూ. 40 వేలు బహుమతిని కైవసం చేసుకున్నారు. గోసులవారిపల్లె వెంకటరమణారెడ్డి వృషభాలు మూడోస్థానంలో నిలిచి రూ. 30 వేలు అందుకున్నారు. కొట్టాలపల్లి రవి ఎడ్లు నాలుగో స్థానంలో నిలిచి రూ.20 వేలు అందుకున్నారు. చీపాడు గ్రామం, స్వామి, గీతారెడ్డిల వృషభాలు ఐదో స్థానంలో నిలిచి రూ.10 వేలు అందుకున్నారు. ఈ పోటీలు నూకనేనిపల్లె గ్రామానికి చెందిన డాక్టర్ గణపతి శంకర్, సంభావు చంద్రశేఖర్, లక్ష్మయ్యల ఆధ్వర్యంలో జరిగాయి. గుత్తికి చెందిన నారాయణ స్వామి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. రాత్రి కుంపిణీపురం గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రేలారే రేలా కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ ఆధ్వర్యంలో ఏఎస్ఐ రాముడు, హెడ్ కానిస్టేబుల్ సుబ్బరాయుడు, పోలీసులు చంద్రయ్య, దిలీప్ కుమార్‌లు గట్టి బందోబస్తు నిర్వహించారు.

ఖమ్మం బిషప్‌గా ఫాదర్ సగిలి ప్రకాష్

కడప కల్చరల్ : మన జిల్లాలో మరియాపురం కథోలిక గురువుగా చాలాకాలం పాటు సేవలందించిన ఫాదర్ సగిలి ప్రకాష్‌కు ఖమ్మం బిషప్‌గా పదోన్నతి లభించింది. కడప అపోస్తలిక పాలనాధికారి బిషప్ గాలిబాలి శనివారం మరియాపురంలోని తన కార్యాలయంలో ఇతర గురువులతో కలిసి ఈ విషయాన్ని వెల్లడించారు. రోమ్‌కు చెందిన ఫ్రాన్సిస్ పోప్ ఈ పదవిలో సగిలి ప్రకాష్‌ను నియమించినట్లు తెలిపారు. దీని ప్రకారం ఆంధ్ర, తెలంగాణ కథోలిక మేత్రాసన పరిధిలో బిషప్ సగిలి ప్రకాష్ అధికారికంగా పాలనావ్యవహారాలు చేపట్టనున్నారు. మనజిల్లాలోని కలసపాడు మండలం మహానందిపల్లె గ్రామంలో 1957 జనవరి 2న ఆయన జోజప్ప, ఆంథోనమ్మలకు జన్మించారు. 1984 ఏప్రిల్ 25న కడప మరియాపురం చర్చిలో గురువుగా అభిషిక్తులై బెంగుళూరు, కడప ఆరోగ్యమాత, మరియాపురం చర్చి, చిత్తూరు శివాడి తదితర ప్రాంతాల్లో తనదైన శైలిలో ఆ ప్రాంతాల అభివృద్ధికి కృషిచేశారు. మేత్రాసన కోశాధికారి ఫాదర్ పెండ్లికట్ల దేవరాజ్, ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ ఎం.వి. ప్రసాద్‌రావు, మరియాపురం విచారణ గురువులు గుడిమె దేవసహాయం తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మదనపల్లె సిటీ: ప్రమాదశాత్తు ద్విచక్రవాహనం గోడకు ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన కురబలకోట మండలం ముదివేడు క్రాస్ వద్ద శనివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. వాల్మీకిపురం మండలం గొల్లపల్లికి చెందిన గురునాథ్(26), యాదమరి మండలం తిరుమలపల్లికి చెందిన ఉదయ్(20)లు ద్విచక్రవాహనంలో తంబళ్లపల్లెకు వెళ్లారు. ఇద్దరు హెచరీస్‌లో పని చేస్తున్నారు.

కోళ్ల విషయంపై షాపు యజమానులతో మాట్లాడి తిరిగి వస్తుండగా ప్రమాదశాత్తు ద్విచక్రవాహనం ముదివేడు క్రాస్ వద్ద ఓ ఇంటి గోడను ఢీకొంది. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. 108 వాహనం ద్వారా మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

వాహనం ఢీకొని దుప్పి మృతి


మరణించిన దుప్పిని పరిశీలిస్తున్న అటవీ సిబ్బంది

రాజంపేట : రాజంపేట పట్టణం బైపాస్ రహదారిలోని మన్నూరు అంజనేయస్వామి గుడి వద్ద చుక్కల దుప్పిని వాహనం ఢీ కొంది. దీంతో దుప్పి అక్కడికక్కడే మృతి చెందింది. తెల్లవారుజామున కడుపుతో ఉన్న దుప్పి రోడ్డు దాటుతుండగా ప్రమాదానికి గురైంది. సమాచారం తెలుసుకున్న అటవీ సిబ్బంది మృతి చెందిన దుప్పిని స్వాధీనం చేసుకొని పంచనామా నిర్వహించారు. ఈ విషయాన్ని రాజంపేట రేంజర్ నారాయణ వెల్లడించారు.

డిజిటల్ విద్యతో దివ్యాంగుల విద్యాభివృద్ధి

డీఈఓ శివప్రకాష్‌రెడ్డి


మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి

రాయచోటి : ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు బోధనలో డిజిటల్ విద్యను ఉపయోగించడం ద్వారా సాధారణ విద్యార్థులతో పాటు దివ్యాంగులకు ఎనలేని ప్రయోజనం చేకూరుతుందని అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి యు.శివప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం అన్నమయ్య జిల్లా విద్యా శిక్షణ సంస్థలో సమగ్ర శిక్ష సహిత విద్య జిల్లా సమన్వయకర్త కె.జనార్ధన ఆధ్వర్యంలో ''విజన్-2025 ఇంక్లూజివ్ ఆంధ్ర'' డిజిటల్ పెడగాగి మీద ప్రత్యేక విద్య ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి పరచుకుని విద్యార్థులకు అందివ్వాలన్నారు. జిల్లాలోని 90 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు, 77 మంది సహిత విద్యా ఉపాధ్యాయులకు ట్యాబ్‌లను ఇచ్చామన్నారు. వాటిని ఉపయోగించుకుని విద్యార్థులకు మెరుగైన శిక్షణ అందించాలని సూచించారు. రీసోర్స్ పర్సన్‌లు బి.మహాలక్ష్మీనాయుడు, పి.సునీల్‌లు ట్యాబ్‌ల వినియోగంపై అవగాహన కల్పించారు. జిల్లా డైట్ ప్రిన్సిపల్ అజయ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ కె.శ్రీనివాసరాజు, జిల్లాలోని స్కూల్ అసిస్టెంట్ ప్రత్యేక ఉపాధ్యాయులు, ఐఈఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వినియోగిత సేవల కేసులకు సత్వర పరిష్కారం


మాట్లాడుతున్న పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణ ప్రసాద్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత

కడప అర్బన్ : ప్రజా వినియోగిత సేవలపై ఆయా శాఖలకు వచ్చిన కేసులను వెంటనే పరిష్కరించాలని పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణ ప్రసాద్ తెలిపారు. శనివారం కడపలోని జిల్లా కోర్టు ఆవరణంలో న్యాయసేవాసదన్‌లో శాశ్వత లోక్ అదాలత్ ఆధ్వర్యంలో వివిధ శాఖల జిల్లా అధికారులకు అవగాహన, సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ ఆయా శాఖల వారీగా కేసులపై సమీక్షించారు. ప్రతి ఒక్కరికి ప్రజా వినియోగిత సేవల చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు 'పోష్' చట్టంతో చెక్

వైవీయూ : పనిచేస్తున్న ప్రదేశాల్లో లైంగిక వేధింపులకు గురైతే వారికి రక్షణగా ప్రొటెక్షన్ ఆఫ్ ఉమన్ ఫ్రం సెక్స్‌వల్ హరాష్‌మెంట్ యాక్ట్-2013 (పోష్) నిలుస్తుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత పేర్కొన్నారు. శనివారం కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో 'లైంగిక వేధింపుల నిరోధక చట్టం-2013, లింగ సున్నితత్వం అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ పనిచేసే ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించడానికి, లైంగిక వేధింపులకు సంబంధించిన ఫిర్యాదుల నివారణ, పరిష్కారానికి పోష్ చట్టం కింద ఫిర్యాదు చేయవచ్చన్నారు. చట్టంలో పేర్కొన్న నిబంధనల ప్రకారం శ్రామిక మహిళలకు పరిహారం కింద అపరాధుల జీతం తీసివేయడం, ప్రతివాదిని వేరే ప్రదేశానికి బదిలీ చేయడం, బాధిత మహిళలకు మూడు నెలల వరకు సెలవు మంజూరు, సమానహక్కుల గురించి వివరించారు.

ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, సమగ్రశిక్ష అభియాన్ ప్రాజెక్టు అధికారి ఎ. ప్రభాకర్‌రెడ్డి, రాయచోటి సీఐ నాగేంద్ర, దిశ ఎస్ఐ బసిరెడ్డి, నాగార్జున డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ పీఓ సుబ్బనరసయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

వింత వైరస్‌తో యువకుడి మృతి


వింత వైరస్‌తో మృతి చెందిన ఇస్మాయిల్

లింగాల : లింగాల మండలం ఇప్పట్ల గ్రామానికి చెందిన గొడుగు ఇస్మాయిల్ (19) అనే యువకుడు వింత వైరస్‌తో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. నాలుగు నెలల క్రితం పిచ్చి కుక్క కరవడంతో అతనికి ఆరోగ్యం క్షీణించింది. దీంతో తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ ఇస్మాయిల్ శనివారం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుక్క కాటువల్ల 20 ఏళ్ల క్రితం ప్రజలకు సోకే వింత వైరస్ ఇస్మాయిల్‌కు సోకిందని వైద్యులు తెలిపారు.

ప్రశ్నార్థకరంగా మల్లెంకొండేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

గోపవరం : శివరాత్రి పర్వదినం సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహించే మల్లెంకొండేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రశ్నార్థకరంగా మారనున్నాయి. దేవదాయశాఖ, పాలక మండలి సమన్వయంతో ఈ బ్రహ్మోత్సవాలు నిర్వహించాల్సి ఉంది. ఈ బ్రహ్మోత్సవాలకు వైఎస్సార్ జిల్లాతో పాటు నెల్లూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలిరానున్నారు. ఇందుకోసం కొండపైన, కొండ దిగువన భక్తులకు సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత దేవదాయశాఖ, పాలక మండలిపై ఉంది. కానీ ఈ సారి నిర్వహించే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు ప్రశ్నార్థకరంగా మారనున్నాయి. దేవదాయశాఖ ఈఓ శివయ్య, పాలక మండలి చైర్మన్ గోవిందరెడ్డి మధ్య వివాదం తారాస్థాయికి చేరుకుంది. పాలకమండలికి తెలపకుండానే అన్ని నిర్ణయాలు ఈఓ తీసుకుంటున్నారని చైర్మన్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మల్లెంకొండేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.18.68 లక్షలు ఈఓ డ్రా చేశారని, ఈ డబ్బును దేనికోసం ఖర్చు చేశారని పాలక మండలి చైర్మన్ ఈఓను ప్రశ్నించారు. సరైన సమాధానం రాకపోవడంతో ఈఓపై చైర్మన్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నారు. ప్రస్తుతం బ్రహ్మోత్సవాలు నిర్వహించాలంటే రూ.10 లక్షలు ఖర్చు చేయాల్సి ఉంది. కానీ ఈఓ బ్యాంకు ఖాతాలో ఉన్న నగదును డ్రా చేయడంతో ఇప్పుడు ఆ డబ్బును ఎవరు ఖర్చు పెట్టాలని చైర్మన్ అధికారులను నిలదీస్తున్నారు. మల్లెంకొండేశ్వరస్వామి బ్యాంకు ఖాతాలో జీరో బ్యాలెన్స్ చూపడంతో ఏ విధంగా బ్రహ్మోత్సవాలు జరపాలని చైర్మన్ మండిపడుతున్నారు. గతేడాది నిర్వహించిన బ్రహ్మోత్సవాలకు స్వామి వారి హుండీ ఆదాయం రూ.9 లక్షలకు పైగా వచ్చినా రూ.8 లక్షలు ఈఓ అధికారికంగా చూపించారని, మిగిలిన రూ.లక్ష ఏమైందని చైర్మన్ ప్రశ్నిస్తున్నారు. రూ.18.68 లక్షలకు కూడా లెక్కలు చూపకపోవడంతో ఈఓ తీరు పలు అనుమానాలకు తావిస్తోంది. అంతే కాకుండా కొండపైన వారం వారం వచ్చిన భక్తులకు తలనీలాలు తీసేందుకు ఒక నాయిబ్రాహ్మణుడిని నియమించాలని పాలక మండలి తీర్మానం చేసినా ఈఓ అందుకు అంగీకరించలేదు. ఈఓ వర్సెస్ చైర్మన్ మధ్య కొనసాగుతున్న ఆరోపణలు, ప్రత్యారోపణల మధ్య బ్రహ్మోత్సవాలు సవ్యంగా జరిగేనా అని స్థానికులు చర్చించుకుంటున్నారు.